క్లుప్తంగా

'మధ్యాహ్న భోజనం' తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

సోమల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాలతో ఉండాలని ఎంపీపీ ఈశ్వరయ్య అన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన రుచి చూశారు. ప్రభుత్వ మెనూ విధిగా పాటించాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర తదితరులు పాల్గొన్నారు.

31న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ కేంద్రం ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

సదుం: స్థానిక సచివాలయం–2లో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కేంద్రాన్ని ఈనెల 31న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. కార్యాలయ పనులను సోమవారం వారు పరిశీలించారు. ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తే ఇక నుంచి సదుం, సోమల, పులిచెర్ల మండల ప్రజలు ఇక్కడే అన్ని సేవలు పొందవచ్చని, పీలేరు కార్యాలయానికి వెళ్లవనసరం పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ గిరిబాబు, పలమనేరు, పుంగనూరు సబ్ రిజిస్ట్రార్లు పద్మశేఖర్‌రెడ్డి, బాలాజి, సదుం ఇన్‌చార్జి షాన్‌వాజ్ పాల్గొన్నారు.

నేడు గృహ సారథులు, కన్వీనర్ల సమావేశం

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. గృహసారథులు, కన్వీనర్ల జీవిత బీమాకు సంబంధించి విధి విధానాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

నేడు మండల సమావేశం

సదుం: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఎల్లప్ప అధ్యక్షతన మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

సెమిస్టర్ ఫలితాల్లో ఐఆర్‌ఎం విద్యార్థులు ప్రతిభ

కుప్పం: ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసినా డిగ్రీ ఆరవ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో కుప్పం ఐఆర్‌ఎం విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు చైర్మన్ దయానిధి తెలిపారు. బీకాంలో శ్వేత, బీబీఏలో సంవికా ఎక్కువ మార్కులు సాధించి, పట్టణంలో మొదటి స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. సెమిస్టర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

పద్యాల పోటీల్లో కీలపట్ల విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు, గ్రామస్తులు


గంగవరం: తెలుగుభాషా దినోత్సవం పురస్కరించుకుని తెలుగు సాహిత్య సమితి జిల్లా స్థాయిలో నిర్వహించిన పద్యాల పోటీల్లో తమ స్కూలు విద్యార్థులు బహుమతులు సాధించారని కీలపట్ల ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం దామోదరం సోమవారం తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన మొదటి ఐదుగురిలో ముగ్గురు తమ స్కూలు విద్యార్థులేనని ఆయన చెప్పారు. ఉపాధ్యాయిలు, గ్రామస్తులు వారిని అభినందించారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారణకు చర్యలు

సోమల: మండలంలో ఇటీవల కుక్కల బెడద ఎక్కువైందని పలువురు తమ దృష్టికి తెచ్చారని, వీటి బెడద లేకుండా చేయడానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఈశ్వరయ్య ఆదేశించారు. కుక్కల బారిన నుంచి ప్రజలను కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

పంట ఎండుముఖం.. లేదు పెట్టుబడికి భయం

- వర్షాభావంతో దెబ్బతింటున్న వేరుశనగ
- పంటల బీమాపై అధికారుల భరోసా
- ముమ్మరంగా ఈ-క్రాప్ నమోదు



రాళ్లబూదుగూరు వద్ద ఎండిన వేరుశనగ పంట

శాంతిపురం: ఈ వర్షాభావం మూలాన వర్షాధార పంటలు బెట్టకు గురవుతున్నాయి. కుప్పం నియోజకవర్గంలో ప్రధాన మెట్ట పంటైన వేరుశనగపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వాతావరణం అనుకూలించక సాగు విస్తీర్ణం బాగా పడిపోయింది. ఈ ఏడు నియోజకవర్గ సాధారణ సాగు విస్తీర్ణం 13,657.50 హెక్టార్లుగా అధికారులు అంచనా వేశారు. 2022 ఖరీఫ్‌లో వేరుశనగ దిగుబడి లాభసాటి కావడంతో ఈ పర్యాయం అంచనాకు మించి సాగు పెరుగుతుందని భావించారు. అయితే అది 4,959.50 హెక్టార్లకే పరిమితమై, కేవలం 35.13 శాతం భూమిలో మాత్రమే సాగులో ఉంది. జూలై నెల ప్రథమార్థంలో కురిసిన కొద్దిపాటి వర్షాలతో ఆమాత్రం విస్తీర్ణంలో రైతులు సాగు చేయగలిగారు. తర్వాత ఆగస్టు ప్రారంభంలో కూడా ఆశించిన వర్షాలు లేకపోయాయి. విత్తనాలు విత్తిన తర్వాత కూడా వానలు అంతంత మాత్రమే కావడంతో పలు దఫాలుగా మొక్కలు వడలిపోయి, మళ్లీ చినుకులు రాలితే పచ్చబడుతూ పెరుగుతున్నాయి. రెండు వారాల నుంచి పూర్తిగా చినుకులు రాలకపోగా ఎండ, వేడి పెరిగాయి. దీంతో వేరుశనగ పంట దెబ్బతింది. ఇకపై వర్షాలు కురిసినా దిగుబడి అనుమానమే. ఇలాంటి పరిస్థితుల్లో ఉచిత పంటల బీమా పథకం ఆదుకుంటుందని, రైతులు ఆందోళనవసరం లేదని వ్యవసాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు భరోసానిస్తున్నారు.

ఉచిత పంట బీమా

గతంలో రైతులు ప్రీమియం చెల్లించి తమ పంటకు బీమా చేయించుకోవాల్సి వచ్చేది. బ్యాంకుల్లో పంట రుణాలు పొందిన వారు మినహా మిగతా రైతులు బీమా చేయించుకునేవారు కాదు. కానీ ఇప్పుడు ప్రభుత్వమే ఆ భారం భరిస్తూ రైతులకు ఉచితంగా పంటల బీమా కల్పిస్తోంది. ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదు చేసుకున్న రైతులు అందరికీ ఈ ఉచిత పంటల బీమా వర్తిస్తోంది. వర్షపాతం, పంట దిగుబడిని పరిగణలోకి తీసుకుని బీమా కంపెనీలు నష్టపోయిన రైతులకు బీమా సొమ్మును చెల్లిస్తాయి. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు సహకరించి, రైతులు తమ పంటను నమోదు చేసుకుంటే వర్షాభావం, ఇతర ప్రకృతి వైపరీత్యాలతో కలిగే నష్టానికి పరిహారం పొందవచ్చు.

వేరుశనగ సాగు వివరాలు (విస్తీర్ణం హెక్టార్లలో)

మండలం	సాధారణ సాగు విస్తీర్ణం	సాగులోని విస్తీర్ణం
రామకుప్పం	2,875.40	860.40
శాంతిపురం	3,397.70	1,577
కుప్పం	4,406.40	1,890.80
గుడుపల్లి	2,978	651.30
మొత్తం	13, 657.50 హెక్టార్లు	4,959.50 హెక్టార్లు

ఈ-క్రాప్ నమోదులో అప్రమత్తం



వర్షాధార పంటలు వేసిన రైతులు విధిగా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలి. ప్రస్తుతం ఈ-క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బందికి సహకరించాలి. 80 శాతం రాయితీతో ఇస్తున్న ఉలవ విత్తనాలు కేవలం బీడుగా ఉన్న భూములకు మాత్రమే. వేరుశనగ తీసుకున్న సర్వే నంబర్లపై మళ్లీ ఉలవలు తీసుకుంటే ఉలవ పంట మాత్రమే రికార్డుల్లో నమోదు అవుతుంది. ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించకపోతే పంటల బీమా నష్టపోయే అవకాశం ఉంది. **–అప్పోజి, వ్యవసాయాధికారి, శాంతిపురం**

అండగా ప్రభుత్వం



ఎలాంటి పరిస్థితులు ఎదురైనా అన్నదాతలకు అండగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలబడుతుంది. సరైన వానలు లేక మెట్ట పంటలు దెబ్బతింటే పంటల బీమా ద్వారా ఆదుకుంటుంది. ఇన్‌పుట్ సబ్సిడీ పేరుతో పంట నష్టపోయాక ఏళ్ల తర్వాత ఇవ్వడం, లేదా పూర్తిగా మొండి చేయి చూపటం గత పాలకుల నైజం. కానీ ఇప్పుడు ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి పరిహారం తర్వాతి సీజన్‌లోనే ఇవ్వడం ద్వారా రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. **–కెఆర్‌జె. భరత్, ఎమ్మెల్సీ**

ఎమ్మెల్యేనే కోరుకుంటున్న ప్రజానీకం

- పచ్చమీడియా విషప్రచారం చేసినా ప్రజలు నమ్మరు
- చిత్తుగా ఓడిన మాజీ మంత్రిని వద్దంటున్న తెలుగు తమ్ముళ్లు



ఎంపీపీ యువరాజు



నాగరాజు

వి.కోట: గతంలో ఎవరూ చేయనంతగా నియోజకవర్గంలో అభివృద్ధి చేసిన వెంకటేగౌడనే మళ్లీ ఎమ్మెల్యే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, ఆయన చేత గత ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడిపోయి, పార్టీ పరువును గంగలో కలిపేసిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి వద్దని సాక్షాత్తు తెలుగు తమ్ముళ్లే ముక్తకంఠంతో చెబుతున్నారని ఎంపీపీ యువరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు పేర్కొన్నారు. సోమవారం వారిద్దరూ తమ కార్యాలయాల్లో వేర్వేరుగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనాడు దినపత్రికలో ప్రచురితమైన 'మాకొద్దు ఈ ఎమ్మెల్యేలు' అనే వార్తపై మండిపడ్డారు. పచ్చ మీడియా ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలపై విషప్రచారానికి తెగబడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ నియోజకవర్గంలో 5 మండలాల్లోని 90 పంచాయతీలలో సుమారు 600 గ్రామాల్లో ఒక్కో ఇంటికి రెండుసార్లు వెళ్లి, ప్రజలతో మాట్లాడారని, తన దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించారన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై, సేవలందిస్తున్న ఆయనకు ప్రజల్లో పెరిగిన ఆదరణను చూసి జీర్ణించుకోలేక తెలుగు తమ్ముళ్లు, పచ్చ మీడియా బురద చల్లినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

రెండు శిలాఫలకాలు ఉంటే తప్పేంటి?

ఇటీవల రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన రెండు అభివృద్ధి పనులకు సంబంధించి రెండు శిలాఫలకాలను ఏర్పాటు చేశారని, దీనిపై కూడా పచ్చమీడియా కథనం వండి వార్చిందని విమర్శించారు. రూ.95 లక్షల పంచాయతీ నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ సముదాయం నిర్మించామని, అలాగే జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చొరవతో జెడ్పీ నిధులతో అదే బస్టాండులో రూ.30 లక్షలతో కాంక్రీట్ పనులు చేపట్టామని, వీటిని తెలియజేస్తూ రెండు శిలాఫలకాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీనిని రెండు వేర్వేరు వర్గాలంటూ పచ్చమీడియా ఆపాదించడం సరి కాదని ఖండించారు.

వేడుకగా మహా కుంభాభిషేకం



స్వామి వారి సేవలో పెద్దిరెడ్డి



ప్రత్యేకాలంకారంలో అరుణాచలేశ్వరస్వామి

సదుం: మండలంలోని జాంద్రపేటలో నూతన పార్వతీ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో మహా కుంభాభిషేక వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎల్ఐసీ సురేంద్రరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో యాగపూజ, కలశార్చన, మహా రుద్రాభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి లక్ష్మి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, ఉప సర్పంచ్ బాబురెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, మనోహర్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాగభూషణంరెడ్డి, దామోదరెడ్డి, కరెంటుబాబు, టీచర్‌రాజు, భాస్కర్, అకులప్ప, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషలో పట్టు ఉంటే రాణింపు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు తెలుగు పుస్తకాలను అందజేస్తున్న అధ్యాపకులు

పలమనేరు: మాతృభాషలో పట్టున్నవారే ఇతర భాషల్లోనూ బాగా రాణిస్తారని పలమనేరు శ్రీ వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయశేఖరం అన్నారు. సోమవారం స్థానిక కళాశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మాతృభాష అమ్మలాంటిదన్నారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామమూర్తి పంతులు చేసిన సేవలను స్మరించుకోవాలన్నారు. కొన్నేళ్లుగా విద్యార్థులు తెలుగుభాషను నిర్లక్ష్యం చేస్తూ ఆంగ్లంపై మోజు పెంచుకుంటున్నారని, అయితే తొలుత మాతృభాషపై పట్టు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం తెలుగుభాషపై నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు తెలుగుభాషకు చెందిన పుస్తకాలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో వాసు, అధ్యాపకులు నందీశ్వరయ్య, షేక్ బేనీజర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



పోటీలలో సిల్వర్ మెడల్ అందుకున్న ధనుష్

పుంగనూరు: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పట్టణానికి చెందిన వార్డెన్ సురేష్‌రెడ్డి కుమారుడు ధనుష్ (7వ తరగతి) అండర్–13 విభాగం కుమితే (ఫైటింగ్) పోటీల్లో రజత పతకం సాధించాడు. ఈ పోటీలు హరియాణాలో మూడు రోజుల పాటు నిర్వహించారు. కోచ్ రెడ్డి మహేష్ మాట్లాడుతూ, చిత్తూరు జిల్లా నుంచి ధనుష్ మాత్రమే ఈ పోటీల్లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించాడని పేర్కొన్నారు. పలువురు ధనుష్‌ను అభినందించారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



పలమనేరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షయ వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా పౌష్టికాహారాన్ని ప్రధానమంత్రి ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా అపోలో టోటల్ హెల్త్ ఫౌండేషన్ అందజేసింది. సోమవారం ఆస్పత్రి చైర్మన్ చెంగారెడ్డి చేతుల మీదుగా వారికి కంది పప్పు, రాగులు, సజ్జలు, మొక్కజొన్న, పాలపౌడర్, శనగనూనెను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ఏడాది పాటు టీబీ రోగులకు పౌష్టికాహారాన్ని ఇవ్వడం అభినందనీయమన్నారు. రోగులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటూ త్వరగా సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఆస్పత్రి సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

పుంగనూరు: పట్టణంలోని మూడు కోర్టుల విధులను సోమవారం న్యాయవాదులు బహిష్కరించారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గల్లా శివ శంకర్‌నాయుడు మాట్లాడుతూ, న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో విజయవాడ, నెల్లూరు, విశాఖపట్నంలో న్యాయవాదులపై దాడులు చేయడం సరికాదని ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న న్యాయవాదులకు రక్షణ కల్పించాలని, ఇందుకోసం అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కోదండరామాలయం పునఃనిర్మాణ పనులు ప్రారంభం

రామకుప్పం: రామకుప్పంలో ప్రసిద్ధి గాంచిన పురాతన కోదండరామస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆలయ ధర్మకర్త, ట్రస్టీ మిట్టపల్లి విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు రామాలయం పునఃనిర్మాణం కోసం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా దేవదాయశాఖ అధికారులకు విన్నవించారు. స్పందించిన దేవదాయశాఖ ఆలయ నిర్మాణానికి రూ.18 లక్షలు మంజూరు చేసింది. అలాగే ఆలయ కమిటీ రూ.5 లక్షలు కార్పస్ ఫండ్‌ను చెల్లించింది. మొత్తం రూ.23 లక్షలతో నూతన కోదండరామాలయాన్ని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం ఆలయంలో వేదపండితులు బాలాలయ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ మూలవిగ్రహాల నుంచి మంగళ కలశాల్లోకి ప్రాణావాహన చేశారు. నూతన హంగులతో, కళాఖండాలతో నూతన ఆలయాన్ని నిర్మించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి తెలిపారు.

కుప్పంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలి

- ఎమ్మెల్సీ భరత్‌తో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కుప్పంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త, చిత్తూరు ఎమ్మెల్సీ భరత్‌కు సూచించారు. సోమవారం నగరి పర్యటనకు వచ్చిన సీఎంను ఎమ్మెల్సీ భరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. కుప్పంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల గురించి సీఎంకు వివరించారు. అలాగే హంద్రీ–నీవా పనులు వేగవంతంగా చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దొంగ ఓట్ల తొలగింపునకు పార్టీ శ్రేణులు పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో కుప్పంలో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని భరత్ సీఎంకు తెలిపారు. అదేవిధంగా కుప్పం అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు భరత్ తెలిపారు.

సీఎంను కలిసిన ఎంపీపీల సంఘం అధ్యక్షుడు

బైరెడ్డిపల్లె: నగరి పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు, కుప్పం ఎన్నికల పరిశీలకులు మొగసాల రెడ్డెప్ప కలిశారు. బైరెడ్డిపల్లె నుంచి పేర్నంబట్ వరకు అంతర్రాష్ట్ర రహదారి ఏర్పాటు మండల ప్రజలకు కలగా మిగిలిపోయిందని, రహదారి ఏర్పాటుకు కృషి చేయాలని సీఎంను కోరినట్లు ఆయన తెలిపారు.



సీఎంని కలిసిన మొగసాల రెడ్డెప్ప, పక్కన ఎమ్మెల్యే వెంకటేగౌడ

థ్యాంక్యూ పెద్దిరెడ్డి సార్!



మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు హేమసుందరరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్ర అటవీ, విద్యుత్, గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సోమవారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు హేమసుందరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలోటీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు పోకల అశోక్‌కుమార్, రెడ్డీశ్వరరెడ్డి,ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్, నరసింహులు శెట్టి,నాదమునిరెడ్డి, చెంచురెడ్డి, నరసింహులు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకంలో వాతావరణమే కీలకం

- అవగాహన సదస్సులో సైంటిస్ట్ సీతారాములు



మాట్లాడుతున్న సైంటిస్ట్ సీతారాములు

పలమనేరు: పట్టుపురుగుల పెంపకంలో వాతావరణమే కీలకపాత్ర పోషిస్తుందని గుర్తెరగాలని హిందూపూర్‌కు చెందిన పట్టు పరిశ్రమశాఖ సైంటిస్ట్ సీతారాములు అన్నారు. పట్టుపురుగులకు సంక్రమించే వ్యాధుల నివారణపై రైతులకు సోమవారం స్థానిక పట్టుగూళ్ల విక్రయ కేంద్రం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొంతకాలంగా ఈ ప్రాంతంలోని పెంచిన పట్టు పురుగులు చంద్రికల్లో వేశాక గూళ్లు కట్టకుండా తీరని నష్టాలు వస్తున్నాయని కొందరు రైతులు సైంటిస్ట్‌ల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన వారు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైంటిస్ట్ పైవిధంగా మాట్లాడారు. ముఖ్యంగా పట్టు పురుగులకు తగినంత స్థలం ఇచ్చి వాటిని పెంచాలన్నారు. అప్పుడే అవి ఆరోగ్యవంతంగా పెరిగి నాణ్యమైన గూళ్లను ఉత్పత్తి చేస్తాయన్నారు. తక్కువ స్థలంలో ఎక్కువ పట్టుపురుగులను పెంచినట్లైతే పాలపురుగులుగా మారి గూళ్లు కట్టని పరిస్థితి కలుగుతుందన్నారు. అలాగే ఈ ప్రాంతంలో ఎక్కువగా బైవోల్టిన్ పట్టుపురుగుల సాగు ఎక్కువగా ఉందని, చాకీ కేంద్రాల నుంచి తెచ్చే పురుగుల సీడ్ సరిగా లేకున్నా ఇలాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

చాకీ సెంటర్ల నిర్వాహకులపై చర్యలేవీ?

అనంతరం పలువురు రైతులు సైంటిస్ట్‌లతో మాట్లాడుతూ, చాకీ సెంటర్లలో రైతులకు విక్రయించే పట్టు పురుగులు నాణ్యంగా ఉన్నాయా, లేదా? అని పట్టు పరిశ్రమశాఖ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తాము తీసుకున్న పట్టు పురుగులు గూళ్లను కట్టకుంటే కలిగిన నష్టాన్ని చాకీ సెంటర్ నిర్వాహకుల నుంచి పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు ఉన్నతాధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలమనేరు సెంట్రల్ సిల్క్ బోర్డు సైంటిస్ట్ వెంకటాచలం, స్థానిక సెరికల్చర్ ఏడీ కిశోర్ నాయక్, పలువురు మండల సెరికల్చర్ అధికారులు, నియోజకవర్గంలోని పట్టు రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌పై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మండల వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతి నిధులు

రొంపిచెర్ల: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, నారా లోకేష్, అచ్చెంనాయుడుపై చర్యలు తీసుకోవాలని రొంపిచెర్ల పోలీసులకు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ రెడ్డిరాజా సోమవారం ఫిర్యాదు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా, అల్లర్లు సృష్టించే విధంగా యువగళం పాదయాత్రలో నారా లోకేష్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం సరికాదన్నారు. ఎవరిపై ఎక్కువగా కేసులు ఉంటే వారికి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవులు ఇస్తామని ప్రకటించడం దారుణమని నిరసించారు. ఆయన ప్రసంగాలకు ప్రేరేపితులై తంబళ్లపల్లె, పుంగనూరు, మాచర్ల నియోజకవర్గాలలో దాడులు చేశారని, పుంగనూరు, అంగళ్ల దాడులలో 400 మంది కేసులలో ఇరుకున్నారని పేర్కొన్నారు. లోకేష్‌తోపాటు రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న చంద్రబాబు, అచ్చెంనాయుడుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఎస్ఐ తులసీరామ్‌కు ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతి నిధులు శివారెడ్డి, అన్వర్‌బాషా, ప్రశాంత్‌రెడ్డి, యశ్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు ముఖ్యం



వైద్యాధికారితో మాట్లాడుతున్న ఎంపీపీ

సోమల: మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ ఈశ్వరయ్య కోరారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను ఆయన పరిశీలించి మాట్లాడారు. వైద్య సిబ్బంది ప్రజలకు 24 గంటలూ పీహెచ్‌సీలో అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన సేవలతో మండలానికి మంచి పేరు తేవాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్‌ను ప్రారంభించిందని, అలాగే గ్రామాలలో ప్రజల ముంగిటకే వైద్యసేవలు అందించేందుకు 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, అయితే వీటిని వైద్య సిబ్బంది ప్రజల దరికి తీసుకెళ్లడంతో విఫలమవుతున్నట్టు మండల సర్వసభ్య సమావేశంలో తమ దృష్టికి వచ్చిందని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగిల్ విండో చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర, పీహెచ్‌సీ వైద్యాధికారి జయసింహ, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, పార్టీ నేతలు వీవీ రమణ, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

ఉలవలు పంపిణీ

రామకుప్పం: స్థానిక రైతు భరోసా కేంద్రంలో సోమవారం రాయితీపై ఉలవ విత్తనాలను సర్పంచ్ మురళీకృష్ణ, ఎంపీపీ సుబ్రమణ్యం, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి రైతులకు పంపిణీ చేశారు. వైస్ సర్పంచ్ ఏజస్, వార్డు సభ్యుడు అబ్దుల్, రైతు భరోసా కేంద్రం అధికారి మధురవాణి, రైతులు పాల్గొన్నారు.

గుడుపల్లె: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటగా సాగు చేయడానికి 80 శాతం రాయితీపై ఉలవ విత్తనాలను ప్రభుత్వం ఇస్తోందని ఎంపీపీ వరలక్ష్మి అన్నారు. సోమవారం గుడుపల్లె రైతు భరోసా కేంద్రంలో ఉలవల విత్తనాలు పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. మండలంలోని 18 రైతు భరోసా కేంద్రాలకు మొత్తం 94 క్వింటాళ్ల ఉలవలు వచ్చాయన్నారు. జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, సర్పంచ్ చెన్నరాయన్, వ్యవసాయాధికారి నాగరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రామకుప్పంలో..



గుడుపల్లెలో..